క్లుప్తంగా

ఎస్పీని కలిసిన సీఐ శ్రీనివాసరావు



కోనేరుసెంటర్: జిల్లా ఎస్పీ పి. జాషువాను గుడివాడ వన్‌టౌన్ సీఐ ఇంద్ర శ్రీనివాసరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల సీఐల బదిలీల్లో భాగంగా ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్ నుంచి గుడివాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సీఐగా వచ్చిన శ్రీనివాసరావు బాధ్యతలు తీసుకున్న అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శ్రీనివాసరావును ఎస్పీ అభినందించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు వహించాలని ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు సూచించారు.

జాబ్‌మేళాలో 13 మందికి ఉద్యోగాలు

గుడివాడ టౌన్: కృష్ణా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 13 మందికి ఉద్యోగ అవకాశాలు కలిగినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక కేబీఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాలో ఇన్నోవసోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ వరుణ్ మోటార్స్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాకు మొత్తం 38 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 13 మంది ఎంపికయ్యారని ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.హరి ధర్మేంద్ర, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పి. మధు, స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్ శేషుబాబు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

చీరలు, పండ్ల పంపిణీ



గుడివాడ టౌన్: గుడ్లవల్లేరు మండలం మామిడికోళ్ల శివారు పెసరమిల్లి సర్పంచ్ గొర్రె విజయలక్ష్మి స్థానిక కరుణాపీఠం ఆశ్రమం, మమత వృద్ధుల ఆశ్రమం, శాంతి వృద్ధుల ఆశ్రమంలోని మహిళలకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ఉన్నతమైన జీవితాలు గడిపిన వారు చివరిలో వృద్ధాశ్రమాలకు పరిమితం కావడం దురదృష్టకరమని వారికి సేవ చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పెసరమిల్లి మాజీ సర్పంచ్ అల్లూరి రామశాస్త్రులు, వార్డు సభ్యులు నాగ నాంచారయ్య, మత్తే శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేద మహిళకు ఆర్థిక చేయూత



కొండాయపాలెం(పామర్రు): నిరుపేద మహిళ ఇల్లు నిర్మించుకునేందుకు మంగళవారం మనం–వనం ఫౌండేషన్ సౌజన్యంతో ఆర్థికసాయం అందజేశారు. పెదమద్దాలి శివారు కొండాయపాలెం గ్రామానికి చెందిన నిరుపేద మహిళ మేడపాటి ఆరోగ్యం తాను ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నానని, తన వద్ద కొంత పూర్వార్జితమైన స్థలం ఉందని, దానిలో గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలని ఫౌండేషన్‌ను కోరారు. దీనిపై స్పందించిన ఫౌండేషన్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు(పీఎస్ఆర్) పేద మహిళకు రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



వెంట్రప్రగడ(పెదపారుపూడి): వెంట్రప్రగడ సచివాలయం వద్ద గుడివాడ అగ్నిమాపక సిబ్బంది మంగళవారం అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి జె.ఆంజనేయులు అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయో వివరించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పారు. వంట గదిలో గ్యాస్ సిలిండర్ ద్వారా జరిగే ప్రమాదాలను వివరించారు. సర్పంచ్ ఆశాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి పాల్గొన్నారు.

జ్వర సర్వే చేయండి

తోట్లవల్లూరు: మండలంలో జ్వరాలపై సర్వే చేయాలని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సాయంత్రం పీహెచ్‌సీ అడ్వయిజరీ సమావేశం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న అధ్యక్షతన జరిగింది. గ్రామాల్లో అక్కడక్కడా జ్వరాలు ఉన్నాయని, వాటిని అదుపు చేయడానికి ఫీవర్ సర్వే చేయాలని రాజామణి, రామ్మోహన్‌రెడ్డి సూచించారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మందులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. సర్పంచ్ పెనుమత్స రాధిక, తహసీల్దార్ కుసుమకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

ఎంపీ బాలశౌరి

ఉరుటూరు(పామర్రు): గ్రామాల అభివృద్ధే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి చెప్పారు. ఉరుటూరులో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యను అందజేస్తున్నామన్నారు. గుప్తుల కాలాన్ని స్వర్ణయుగం అనేవారని వైఎస్ రాష్ట్రాన్ని పాలించిన సమయం కూడా స్వర్ణయుగంగా ఖ్యాతిగడించిందన్నారు. తండ్రి అడుగు జాడల్లో పయనిస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిన్నారులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నారని చెప్పారు. మచిలీపట్నంలో రూ.5 వేల కోట్ల నిధులతో పోర్టును నిర్మిస్తున్నామని, బందరులో మెడికల్ కళాశాల, మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిని నాలుగులైన్ల రహదారిని ఆరు లైన్ల రోడ్డుగా మార్పు జరుగుతోందని తెలిపారు.

పీఎంజీఎస్‌వై ద్వారా రూ.4.70 కోట్లతో రహదారి

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన(పీఎంజీఎస్‌వై)లో గ్రామంలో సుమారు 7 కిలోమీటర్ల ప్రధాన రహదారి ఏర్పాటుకు రూ.4.70 కోట్ల నిధులు మంజూరు చేసి త్వరలో రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పీఎంజీఎస్‌వై పథకంలో కేంద్రం 60 శాతం నిధులు మంజూరు చేస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు మంజూరు చేస్తుందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి 40 శాతం నిధులు త్వరితగతిన మంజూరు కావడానికి చర్యలు తీసుకుంటున్నామని అతి త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పామర్రు నియోజకవర్గంలో సుమారు రూ.2.50 కోట్లు ఎంపీ నిధులు వెచ్చించి పలు రహదారులు, కమ్యూనిటీ భవనాలను ఏర్పాటు చేశామన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గ్రామంలో మూడు సీసీ రోడ్లు, ఎంపీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన రోడ్లను ప్రారంభించారు. తర్వాత పామర్రు ఏడో వార్డులో 90మీటర్ల సీసీ రోడ్డు, రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు. గ్రామంలో ప్రధాన రోడ్డు వేసిన తర్వాతే గ్రామస్తులను ఓటు అడుగుతానని చెప్పారు. అక్టోబరు 15వ తేదీన పామర్రులో 1,800 ఇళ్ల స్థలాల పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి గజమాలలతో సన్మానించారు. సర్పంచ్ ముప్పిడి శ్రీనవత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, మొవ్వ జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీలు వెంకటేశ్వరమ్మ, తాడిశెట్టి శ్రీనివాసరావు, రత్నకుమారి, పార్టీ నేతలు కాకర్ల వెంకటేశ్వరరావు, ముప్పిడి సురేష్‌రెడ్డి, కె.పరశురామిరెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉరుటూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ తదితరులు

తోట్లవల్లూరు మండలంలో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు శివారు కలాసుమాల పల్లిలో రూ. 10 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన రెండు సిమెంటు రహదారులను ఎంపీ బాలశౌరి, పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్‌తో కలిసి మంగళవారం ప్రారంభించి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహానికి వారిద్దరూ పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. అనంతరం గ్రామంలో రూ. 36 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో ముచ్చటించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన జరుగుతోందన్నారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ పెనుమత్స రాధిక, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు మోర్ల రామచంద్రరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో చక్కని ఆరోగ్యం

తోట్లవల్లూరు: పౌష్టికాహారంతోనే చక్కని ఆరోగ్యం లభిస్తుందని ఉయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ సుజాత సూచించారు. పోషణ మహాలో భాగంగా స్థానిక జుమా మసీదు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం జరిగింది. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యకరమైన బిడ్డలకు జన్మనిచ్చే అవకాశం ఉంటుందని సుజాత తెలిపారు. ఆకుకూరలు, పప్పు, పాలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఎంఎస్‌కే శివలీల, ఆరోగ్య సిబ్బంది కృష్ణవేణి, కిరణ్‌కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు సలోమి, కోకిలారాణి, విజయకుమారి, భాగ్యం తదితరులు పాల్గొన్నారు.

కనుమూరు(పామర్రు): కనుమూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీసీ కురుమద్దాలి సెక్టార్ సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పుష్పావతి, కె.ప్రసన్న, సహాయకులు వి.అమరేశ్వరి, జె.శోభనాకుమారి తదితరులు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో అవగాహన కలిగిస్తున్న సుజాత

అర్హులందరికీ పింఛన్ల పంపిణీ

పామర్రు: అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. జుఝువరంలో కొత్తగా మంజూరైన పెన్షన్లను మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 425 కొత్త పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. వీటిని ఆయా సచివాలయాల పరిధిలో పంపిణీ చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగా గ్రామంలో మంజూరైన కొత్త పెన్షన్లను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, సర్పంచ్ పి.పున్నమ్మ, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, కిషోర్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

232 మందికి కొత్త పింఛన్లు మంజూరు

మండవల్లి: మండలంలో కొత్తగా 232 మందికి పింఛన్లు రూ. 6,46,500 మంజూరైనట్లు ఎంపీడీఓ సి.వెంకటరమణ మంగళవారం తెలిపారు. మంజూరైన పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.



కొత్తగా మంజూరైన పెన్షన్ అందిస్తున్న పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల అందజేత

కైకలూరు: స్త్రీ శిశు సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దండే పుష్పలత చెప్పారు. కైకలూరు 1, 11 వార్డుల్లో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నాడు – నేడు కార్యక్రమం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలను మార్చివేశారన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని తెలిపారు. సీడీపీవో ఆనంద్ మాట్లాడుతూ పౌష్టికాహార మాసోత్సవాలు ఈ నెల 30 వరకు నిర్వహిస్తామన్నారు. గర్భిణులకు పోషకాహారం కిట్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బోడిచర్ల స్వాతి, అంగన్‌వాడీ టీచర్ లీలావతి, సహాయకురాలు కనకం, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పుణ్యవతి, మహిళా పోలీసు మాధురి, నాయకులు దండే రవిప్రకాష్ పాల్గొన్నారు.



కైకలూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార కిట్లు అందిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ పుష్పలత

కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్‌కు కీర్తిపురస్కారం


కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రకటించిన కీర్తి పురస్కారాన్ని కూచిపూడి నాట్యాచార్యులు, శ్రీ సిద్ధేంద్ర కూచిపూడి నాట్యకళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవిబాలకృష్ణ అందుకున్నారు. గతంలో ప్రతిష్టాత్మక బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాన్ని అందుకున్న చింతా రవి బాలకృష్ణ తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తంగెడ కిషన్, ఆచార్య ఎస్. జయరామిరెడ్డి, ఆచార్య భట్టు రమేష్ చేతుల మీదగా మంగళవారం హైదరాబాదులోని యూనివర్సిటీ ప్రాంగణంలో అందుకున్నట్లు కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి వెల్లడించారు. ఈయనతో పాటు వివిధ కళల్లో నిష్ణాతులైన మరో 45మందికి ఈ అవార్డు వరించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. రవిబాలకృష్ణను కళాపీఠం అధ్యాపకులు, ఇతర సిబ్బంది, కూచిపూడి నాట్య కుటుంబం అభినందనలు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న చింతా రవిబాలకృష్ణ

క్రీడా పరికరాల కొనుగోలుకు విరాళం

పెడన: పాఠశాలలో క్రీడా పరికరాల కొనుగోలుకు భట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మట్టా రాధాకృష్ణమూర్తి రూ. 10 వేలను అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని హెచ్‌ఎం ఉషకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



జలజీవన్ మిషన్ నిధులతో ప్రతి ఇంటికీ కుళాయి

మండవల్లి: జలజీవన్ మిషన్ నిధులు మండవల్లికి రూ. 69 లక్షలు, అగ్రహారానికి రూ. 9 లక్షలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వి.వి. కృష్ణారావు మంగళవారం మండవల్లిలో పేర్కొన్నారు. ఐక్య వేదిక మండల శాఖ ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు ఇటీవల స్పందన కార్యక్రమంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో కుళాయిలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఏఈఈ కృష్ణారావు ఈ విషయంపై టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయినట్లు తెలిపారు. పైపులైన్ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సుమారు నెల రోజుల్లో కుళాయిలు లేనివారికి ఇంటికో కుళాయి ఉచితంగా అంజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పెద్దింట్లమ్మ దేవస్థానంలో వేలం పాటలు

కై కలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద రెండేళ్ల కాలపరిమితికి వివిధ వేలం పాటలను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కేవీ గోపాలరావు మంగళవారం చెప్పారు. భక్తులకు షామియానా వంట పాత్రల సరఫరా, తలనీలాలు, పాదరక్షలు భద్రపర్చడం తదితర పనులను లీజుకు ఇవ్వడానికి వేలం నిర్వహిస్తామన్నారు. అదే రోజు ఉదయం 10 గంటలకు పెద్దింట్లమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కిస్తామని తెలిపారు.

విధులను సక్రమంగా నిర్వహించండి

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం ఆమె కార్యాలయంలోని పబ్లిక్ హెల్త్ విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగులు ఏ సమయానికి కార్యాలయానికి వస్తున్నది అడిగి తెలుసుకుని అటెండెన్స్‌ను పరిశీలించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ ఎలా జరుగుతున్నదీ ఆరా తీశారు. నగరంలోని పలు దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ ఎలా ఇస్తున్నదీ రికార్డులను పరిశీలించారు. చెత్త పన్ను వసూలు పురోగతి ఎలా ఉన్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయానికి సకాలంలో విచ్చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్ మేకల సుబ్బన్న పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు చేశారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారి పుట్టలో పాలుపోసి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో 150 మంది భక్తులు అభిషేకాలు చేయించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

సులభశైలిలో పాఠ్యాంశాల బోధన

ముదినేపల్లి రూరల్: ప్రాథమిక తరగతుల విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఎంఈఓ కె.నరేష్‌కుమార్ అన్నారు. పెయ్యేరు ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆంగ్లం, గణితం వంటి సబ్జెక్టులపై ప్రాథమిక విద్యార్థులు ఎక్కువగా ఆందోళన చెందే అవకాశం ఉందన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను నిరంతరం పరిశీలిస్తూ ఇందుకు అనుగుణంగా సులభశైలిలో బోధన చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయుడు బేతాళ రాజేంద్రప్రసాద్ పాఠశాల ప్రగతిని, నాడు–నేడు పనుల పురోగతిని వివరించారు. ఎంఈఓ రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా మండల స్థాయి ఆటల పోటీలు

కైకలూరు(కలిదిండి): ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కలిదిండి మండలం ఆరుతెగళపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్, ఖోఖో, యోగా వంటి 8 అంశాల్లో బాలురకు పోటీలు జరిగాయి. మండలంలోని పాఠశాలల నుంచి 275 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మండల స్పోర్ట్స్ కన్వీనర్ పీడీ పి.లూయిస్ మాట్లాడుతూ అండర్–14, అండర్–17 విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన క్రీడాకారులను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. బుధవారం బాలికలకు పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ నెల 15, 16 తేదీల్లో ఆరుతెగళపాడు ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల నిర్వహణలో ఆరుతెగళపాడు హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరావు, పీడీలు జి.రవిబాబు, ఎ.మల్లేశ్వరరావు, ఎం.వెంకటేశ్వరరావు, బి.కృష్ణకుమారి, కె.రత్నదాసు, ఎండీ రబ్బాని, పలువురు ప్రైవేటు పాఠశాలల పీఈటీలు హాజరయ్యారు.

క్రీడాదుస్తుల పంపిణీ

క్రీడాకారులకు ఆరుతెగళపాడు పూర్వ విద్యార్థి పడబక్కల శేఖర్‌బాబు, దళిత నాయకుడు జక్కుల విజయ్‌కుమార్ కలిసి రూ.15 వేలతో క్రీడాకారులకు క్రీడాదుస్తులు పాఠశాల వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో టి.శంకరరావు, ఎ.రాజేంద్రప్రసాద్, ఎస్.మృత్యుంజయుడు, డి.వి.నాగేశ్వరరావు, ఐ.రమేష్, ఈద సునీల్ బాబు, వంశీకృష్ణ పాల్గొన్నారు.



కలిదిండి మండలం ఆరుతెగళపాడు పాఠశాలలో విద్యార్థులకు కబడ్డీ పోటీలు

టీడీపీ, జనసేన నాయకులపై కేసులు నమోదు

గుడివాడరూరల్: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో ఆందోళనలతో ప్రజలకు ఇబ్బంది కలిగించిన టీడీపీ, జనసేన నాయకులపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి టూటౌన్ ఎస్ఐ పి.నాగరాజు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు వర్గానికి చెందిన టీడీపీ నాయకులు ముళ్లపూడి రమేష్, గోవాడ శివ, నున్న పృథ్వీ, కె.మహేష్, సాలి నవీన్‌కుమార్, వేమండ్ర భరత్‌చంద్ర, వెంకటేశ్వరరావు, మజ్జాడ నాగరాజు, ఎం.అమరేశ్వరరావు, బాతు శ్యామ్‌ప్రసాద్, దేవరపల్లి లక్ష్మీకోటయ్యలపై 161సీఆర్‌పీ కింద బైండోవర్ కేసు నమోదు చేశారన్నారు. టూటౌన్ పీఎస్ వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు వెనిగళ్ల రాము, వెనిగళ్ల రామకృష్ణ, కడియాల గణేష్, నిమ్మగడ్డ సత్యసాయి, కైలా సుబ్బారావు, కఠారి రాంబాబు, అందుగుల ఏసుపాదం, సిరిపురపు తులసీరాణిలతో పాటు మరో 40 మందిపై 341, 143, 188, రెడ్ విత్ 149 ఐపీసీ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రోడ్డుపై ధర్నా చేస్తూ ట్రాఫిక్ అంతరాయం కలిగించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, బి.వీర్రాజు, కోదమల గంగాధర్, పడవల పూర్ణ చంద్రశేఖర్‌లపై 341, 143, 188, రెడ్‌విత్ 149 ఐపీసీ కింద కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు వివరించారు.

మృతుని కుటుంబానికి రూ.4లక్షల సీఎంఆర్ఎఫ్ అందజేత

పామర్రు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అబ్దుల్ మొబిన్ కొంత కాలం క్రితం కరోనాతో మరణించారు. పార్టీకి ఆయన చేసిన కృషిని, కుటుంబ ఆర్థిక పరిస్థితిని స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మొబిన్ కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించి సీఎంఆర్ఎఫ్ కింద రూ.4 లక్షలను మంజూరు చేశారు. ఈ చెక్కును మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో మొబిన్ కుటుంబసభ్యులకు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, నాయకులు వెంకటేశ్వరరావు, ఖాజీ,యూనుస్, ఎంపీటీసీ టీ శ్రీను, ఏఎంసీ డైరెక్టర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్

సంక్షేమ పాలనతో ప్రజల్లో సంతోషం

జుఝువరం(పామర్రు): నాలుగున్నర ఏళ్ల సంక్షేమ పాలనలో ప్రజలు సంతోషంగా ఉంటున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. జుఝువరం గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లుగా అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ద్వారా తెలుసుకున్న ప్రజా సమస్యలను సీఎం అయిన తర్వాత ఇప్పటి వరకు 98శాతం వరకు పరిష్కరించారని చెప్పారు. ప్రజాధనాన్ని పప్పు బెల్లాలుగా తిని చంద్రబాబు అడ్డంగా దొరికి జైలుకు వెళ్లారన్నారు. మహిళలు, రైతులు, విద్యార్థులు, సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు, చిరు వ్యాపారులు, డ్వాక్రా సంఘాల సభ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం నవరత్న పథకాలను ప్రవేశపెట్టి అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, రమాదేవి, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, పి.రత్నకుమారి, సర్పంచ్ పి.పున్నమ్మ, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, పెయ్యల రాజు, పుట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధి గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 149 మందికి గ్రామానికి చెందిన ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ సభ్యులు ఘట్టమనేని బాబూరావు నోట్ పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. దాత బాబూరావు మాట్లాడుతూ విద్య ద్వారానే ఉన్నత స్థితికి చేరుకోగలరని చెప్పారు. ఈ సందర్భంగా దాత బాబూరావును హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు అభినందించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, ఉపాధ్యాయులు, హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ. 4 లక్షల జరిమానా వసూలు

మచిలీపట్నంటౌన్: విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం మచిలీపట్నం నియోజకవర్గంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ ముఖ్య అధికారి అల్ఫాన్స్ ఆధ్వర్యంలో 70 మంది విద్యుత్ ఇంజినీర్లు, ఉద్యోగులు 35 బృందాలుగా ఏర్పడి మచిలీపట్నం రూరల్ సెక్షన్ పరిధిలోని సర్వీసులను పరిశీలించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారికి జరిమానా విధించారు. 1550 సర్వీసులను తనిఖీ చేసి 52 కేసులు నమోదు చేశారు. వీరి నుంచి రూ. 4 లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా అల్ఫాన్స్ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, విద్యుత్‌ను అక్రమంగా వినియోగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో విద్యుత్ శాఖ మచిలీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు, విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: ఈడేపల్లిలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి 1008 బత్తాయిలతో అలంకరణ చేశారు. మహాలక్ష్మి జ్యూస్ షాప్ యజమాని వంశీకృష్ణ బత్తాయిల అలంకరణను చేయించారు.

ప్రకటన

నా క్లయింటుస్నూ, కృష్ణాజిల్లా గుడివాడ పట్టణ బాపూజీ నగర్, డోర్ నెం. 1/545-2 కాపురస్తుడు అబ్దుల్ రషీద్ గారి కుమారుడు అబ్దుల్ సుభాని గారి సంజాయిషీ ప్రకారము యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎరకల వీరమ్మ గారి నుండి కొనుగోలు చేసే ఉద్దేశ్యముతో నా క్లయింటు ఒక ఒప్పందము చేసుకొని యున్నారు. సదరు వీరమ్మ గారికి చెందిన షెడ్యూలు ఆస్తి తాలూకు లింకు డాక్యుమెంటు నెం. 2625/1985 ది. 3-9-2023వ తేదీన గుడివాడ శ్రీ కాళహస్తి కాలనీ నుండి పెద్దకాలువ సెంటర్‌కు జిరాక్స్ కాపీల నిమిత్తము తీసుకొని వెళ్ళుచుండగా పోయినది. సదరు డాక్యుమెంటు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది వారికి అందజేయ ప్రార్థన. షెడ్యూలు ఆస్తిని గురించి ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల 10 రోజులలోపు ఈక్రింది అడ్రస్‌కు వ్రాతపూర్వకముగా తెలియజేయవలసినది.

షెడ్యూలు : కృష్ణాజిల్లా, గుడివాడ మునిసిపాలిటీ 1వ వార్డులోని R.S.No. 248, డోర్ నెం. 1/566-2A, గుడివాడ N.G.O.'s Housing Ltd., లోని ప్లాట్ నెం. 81 దాఖలా చ॥గ॥ 194.4 స్థలమునకు హద్దులు : తూర్పు : 70 అ॥ -మహేశ్వరం రాజేశ్వరి గారి స్థలం, దక్షిణం : 25 అ॥ -ఇతరుల స్థలం, పడమర : 70 అ॥ - 33 అ॥ మున్సిపల్ బజారు, ఉత్తరం : 25 అ॥ - 100 అ॥ ల గుడివాడ-బంటుమిల్లి రోడ్డు. ఈ హద్దుల మధ్య 194.4 చ॥గ॥ల స్థలము.

గుడివాడ 12-9-2023 — కాకాని శ్రీకృష్ణ, బి.ఏ., బి.యల్. అడ్వకేట్, సెల్ : 94908 47393